క్లుప్తంగా

నడుపల్లిలో 107 మందికి కంటి పరీక్షలు



రోగులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

పెరవలి: మండలంలోని నడుపల్లి గ్రామంలో శుక్రవారం రామకృష్ణ సేవాసమితి, కానూరు శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం వైద్యులు ఈ శిబిరంలో 107 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. వారిలో 40 మందికి కళ్ల జోళ్లు, ఎనిమిది మందికి కంటి చికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు చామర్తి సత్యనారాయణ, నడుపల్లి ఉప సర్పంచ్ అన్నమరెడ్డి రవీంద్రనాథ్ చౌదరి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ రాజు, కరుటూరి శ్రీను, దత్తు, సింహాద్రి సురేష్, నరమామిడి పోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పెరవలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

సచివాలయాన్ని పరిశీలించిన కలెక్టర్

నిడదవోలు రూరల్: మండలంలోని రావిమెట్ల గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఎర్ర కాలువ ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్ అక్కడి నుంచి సచివాలయానికి వెళ్లారు. వరద ముంపుతో నష్టపోయిన పొలాలను పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలని మండల స్థాయి అధికారులను ఆమె ఆదేశించారు. అనంతరం ఉన్నతాధికారులతో సచివాలయ నుంచే వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. తహసీల్దార్ నాగభూషణం, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు రూ.4.09 కోట్లు

నిడదవోలు రూరల్: ఉపాధి హామీ నిధుల్లో భాగంగా మండలంలోని 23 గ్రామాల్లో 84 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4.09 కోట్లు మంజూరైనట్టు ఎంపీడీఓ జేఏ ఝాన్సీ శుక్రవారం తెలిపారు. మంత్రి కందుల దుర్గేష్ సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

నిడదవోలు: భారీ వర్షాలక పట్టణంలో ముంపులో చిక్కుకున్న ప్రాంతాలను మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ శుక్రవారం అధికారులతో కలసి పరిశీలించారు. నీట మునిగిన ఆర్టీసీ బస్టాండ్‌లోని వరద నీటిని మోటార్ సహాయంతో డ్రైనేజీలోకి మళ్లిస్తున్నారు. అక్కడి అధికారులకు ఆయన తగిన సూచనలు ఇచ్చారు. అక్కడి నుంచి రాయపేటలో ఉన్న మాలపోడు మురుగు డ్రైన్‌ను, ఆర్వోబీ పనులు చేస్తున్న ప్రాంతంలో బ్లాక్ అయిన డ్రైన్లను ఆదినారాయణ పరిశీలించారు. కమిషనర్ రామ్ భూపాల్ రెడ్డి, డీఈఈ మాధవి, మున్సిపల్ ఏఈ హేమంత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ గుడిలోకి వరద

నిడదవోలు: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారి ఆలయంలోకి వరద నీరు చేరింది. ఈ నీటిని మోటార్ల సాయంతో బయటకు తోడేస్తున్నట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ఈనెల 21న అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ముంపు కాలనీని పరిశీలించిన ఎమ్మెల్యే

కొవ్వూరు: భారీ వర్షాలకు ముంపు బారిన పడిన పట్టణ శివార్లలోని జగనన్న కాలనీ-3ను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని మురుగు కాలువలో గుర్రపు డెక్క పేరుకుపోయి వర్షపు నీరు ముందుకు పారడం లేదని కాలనీ వాసులు వివరించారు. దీంతో ఎమ్మెల్యే కాలువను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడు జేసీబీ ఏర్పాటు చేయించి గుర్రపు డెక్క తొలగింపునకు చర్యలు చేపట్టారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, తహసీల్దార్ కె.మస్తాన్, సూరపనేని చిన్ని, కమిషనర్ డానియేలు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటన

గోపాలపురం: భారీ వర్షాలకు గోపాలపురం గ్రామంలో ముంపు బారిన పడిన లోతట్టు ప్రాంతాలను శుక్రవారం మండల ప్రత్యేకాధికారి డాక్టర్ టి. శ్రీనివాస్, ఎంపీడీవో కె.రమేష్‌బాబు పరిశీలించారు. వరద నీరు నిల్వ ఉండకుండా డ్రైన్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి వెంకాయమ్మకు ఈ సందర్భంగా శ్రీనివాస్ ఆదేశించారు. కాగా భారీ వర్షాలకు మండలంలో 1,500 ఎకరాల్లోని వరి పంట నీట మునిగినట్టు ఏవో రాజారావు తెలిపారు. చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లి గ్రామాల్లో శుక్రవారం పర్యటించి పంట నష్టం అంచనా వేసినట్టు చెప్పారు.

జలమయం

- దంచి కొడుతున్న వానలు
- మరోపక్క పొంగుతున్న కాలువలు
- డివిజన్‌లో 4.031 ఎకరాల్లో పంటలు నీట మునక
- పోచవరం శ్మశానవాటికను ముంచెత్తిన వరద
- రెండడుగుల లోతు నీటిలో మృతదేహం తరలింపు



తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట వద్ద మురుగు కాలువ ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రాంబాబు

కొవ్వూరు: వర్షాలు దంచి కొడుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు ఇప్పటికే జలమయం అయ్యాయి. భారీ వర్షాలను పురస్కరించుకుని ఇప్పటికే శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం వరకూ అన్ని యాజమాన్యాల కింద పని చేసే పాఠశాలలకు జిల్లా అధికారులు సెలవు ప్రకటించారు. తాళ్లపూడి మండలం పోచవరం శ్మశానవాటికకు వెళ్లే రోడ్డును వరద పూర్తిగా ముంచెత్తింది. శుక్రవారం ఓ మహిళ చనిపోతే ఆమె బంధువులు, కుటుంబ సభ్యులు మృతదేహం ఉన్న శవపేటికను ఎత్తుకుని రెండు అడుగుల లోతు నీళ్లల్లో శ్మశానవాటికకు వెళ్లాల్సి వచ్చింది. అంత్యక్రియల సమయంలోను వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద ముంచెత్తడంతో లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాలకు కొవ్వూరు డివిజన్‌లోని కొవ్వాడ, ఎర్ర కాలువ, పేముల కాలువ పరీవాహక ప్రాంతాలతో పాటు, లోతట్టు ప్రాంతాల్లోని 4,031 ఎకరాల్లోని వరి పంట ముంపు బారిన పడినట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. నల్లజర్ల మండలం తెలికిచెర్ల గ్రామంలో తాడిపూడి కాలువకు గండి పడింది. భారీగా వరద నీరొచ్చి చేరుతుండడంతో ఎక్కడికక్కడ చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. ఇన్ ఫ్లో ఎక్కువగా ఉండడంతో చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. గోపాలపురం మండలం భీమోలు పెద్ద చెరువు, బొల్లెల చెరువు, దేవరపల్లి మండలం యర్నగూడెంలో గండిచెరువు, యాదవోలులో ఊర చెరువు, నల్లనీళ్ల కట్టు చెరువులు నిండిపోయాయి. ఎగువన కురుస్తున్న వర్షాలకు గోపాలపురం, పోలవరం మండలాల సరిహద్దుల్లో ఉన్న కొవ్వాడ జలాశయానికి భారీగా వరద నీరొచ్చి చేరుతోంది. మరో వైపు ఎర్ర కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నల్లజర్ల, నిడదవోలు మండలాల అధికారులు అప్రమత్తం అయ్యారు. గోపాలపురం మండలంలోని వెంకటాయపాలెం, చిట్యాల, చెరుకుమిల్లి గ్రామాలను, తాళ్లపూడి మండలంలోని తిరుగుమెట్ట, పోచవరం, రాగోలపల్లి, తుపాకులగూడెం, అన్నదేవరపేట, కొవ్వూరు మండలంలోని ధర్మవరం గ్రామాలను కొవ్వాడ కాలువ వరద ముంచెత్తింది. గోపాలపురం మండలంలో గరిష్ఠంగా 860 ఎకరాల్లోని పంటలు నీట మునిగాయి. కొవ్వూరు డివిజన్‌లోని దాదాపు అన్ని మండలాల్లోనూ వరద ప్రభావం కనిపిస్తోంది. లోతట్టు ప్రాంతాల్లోని పంటలు ముంపు బారిన పడ్డాయి.

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

ఇప్పటికే జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఇతర అధికారులు ఎర్ర కాలువ పరీవాహక ప్రాంతమైన నల్లజర్లతో పాటు కొవ్వూరు మండలం మద్దూరులంకలో గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. నల్లజర్ల మండలం ఈస్ట్ అండ్ వెస్ట్ చోడవరం, హనుమాన్‌లంక, గుండెపల్లి, అనంతపల్లి గ్రామాల్లోని 13 కుటుంబాలకు చెందిన 87 మందికి పాఠశాలలో పునరావాస శిబిరం ఏర్పాటు చేశారు. కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామ పరిధిలో నివాసం ఉంటున్న మత్స్యకారులను ధవళేశ్వరం ఆనకట్ట వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు ముందే పునరావాసం కేంద్రానికి తరలించాలని కలెక్టర్ ఆదేశించారు.



కొవ్వూరు మండలం మద్దూరులంకలో అధికారులతో వరద పరిస్థితిపై ఆరా తీస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రికార్డు స్థాయిలో వర్షం...ముంపులో పంటలు

గత రెండు రోజులుగా కొవ్వూరు డివిజన్‌లో రికార్డు స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. మండలాల వారీగా దేవరపల్లిలో 610, ఉండ్రాజవరంలో 715, కొవ్వూరులో 415, చాగల్లులో 349, తాళ్లపూడిలో 281, నిడదవోలులో 250, ఉండ్రాజవరంలో 715, పెరవలిలో100, నల్లజర్లలో 376 ఎకరాల్లోని వరి పంటను వరద ముంచెత్తినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తాళ్లపూడి మండలంలో 15, గోపాలపురం మండలంలో ఆరు, పెరవలి మండలంలో ఐదు ఎకరాల్లోని వరి నారుమళ్ల ముంపుబారిన పడ్డాయి.

క్రమంగా పెరుగుతున్న గోదావరి

గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. దాంతో లంక భూములు సాగు చేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. డివిజన్‌లోని పెరవలి, తాళ్లపూడి, కొవ్వూరు, నిడదవోలు మండలాల్లోని లంక పంటలకు ముంపు పొంచి ఉంది. నదీ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువన భద్రాచలంలో క్రమంగా వరద ఉధృతి పెరుగుతోంది.

కొవ్వాడ కాలువ ఉగ్రరూపం

- అర కిలోమీటరు పొడవునా రోడ్డుపై నీటి ప్రవాహం
- పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు



తాళ్లపూడి మండలం పోచవరం వద్ద పీఆర్ రోడ్డుపై ప్రవహిస్తున్న కొవ్వాడ కాలువ నీరు



తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట వద్ద ముంపులో ఉన్న వరి చేలు

తాళ్లపూడి: కొవ్వాడ కాలువ ఉగ్రరూపం దాల్చింది. మండలంలోని పంట పొలాలు ముంపులో చిక్కుకున్నాయి. ఎగువన కురుస్తున్న వర్షాలతో కొవ్వాడ కాలువలోకి వచ్చి చేరుతున్న నీరు శుక్రవారం ఒక్కసారిగా పెరిగింది. రాగోలపల్లి నుంచి తాడిపూడి వైపు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు కల్వర్టుపై 15 అడుగుల ఎత్తున అర కిలోమీటరు పొడవునా నీరు ప్రవహిస్తోంది. అలాగే అన్నదేవరపేట నుంచి వేగేశ్వరపురం, తిరుగుడుమెట్ట వైపు వెళ్లే రెండు కల్వర్టులపై నుంచి కూడా వరద నీరు ప్రవహిస్తోంది. వరద నీటికి వరి, కూరగాయల పంటలు మునిగాయి. రాగోలపల్లి, పోచవరం, తుపాకుల గూడెం, బయ్యారం, అన్నదేవరపేట గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లోని వివిధ పంటలు ముంపు బారిన పడ్డాయని రైతులు తెలిపారు. తిరుగుడుమెట్ట, అన్నదేవరపేట గ్రామాల్లో కొవ్వాడ కాలువ, మురుగు కాలువల వరద ఉధృతికి నీట మునిగిన వరి పంటను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముంపు నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండలంలో శుక్రవారం కూడా కుండపోత వర్షం కురవడంతో జనజీవనానికి పూర్తిగా కలిగింది. పలు గ్రామాలోని రోడ్లపైన, పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. రోడ్లు చిత్తడిగా మారాయి. ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. వేగేశ్వరపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం చుట్టూ వర్షపు నీరు నిలిచిపోయింది. తిరుగుడుమెట్ట, పెద్దేవం, వేగేశ్వరపురం, పైడిమెట్ట, తాళ్లపూడి, అన్నదేవరపేట, రాగోలపల్లి తదితర గ్రామాల్లో ఇటీవల వేసిన వరినాట్లు పూర్తిగా నీట మునిగాయి. దాదాపు 760 ఎకరాల్లోని వరిపంట నీట మునిగినట్టు ఏవో జి.రుచిత తెలిపారు. మండల ప్రత్యేకాధికారి, డి.రాంబాబు శుక్రవారం తిరుగుడుమెట్ట, పెద్దేవంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మురుగు కాలువలను, ముంపులో ఉన్న వరి చేలను శుక్రవారం పరిశీలించారు. ఎంపీడీవో వెంకటరమణ, ఏవో జి.రుచిత, డీటీ భారతి, పంచాయతీ కార్యదర్శులు ఆయన వెంట ఉన్నారు.

ముంపులోనే పంటలన్నీ..



చాగల్లు మండలం నందిగంపాడులో నీట మునిగిన వరిచేలు

చాగల్లు: విడవకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకూ మండలంలో 107.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎగువ నుంచి వర్షపు నీరు రావడంతో ఊనగట్ల ఎస్సీ కాలనీ ఇళ్లల్లోకి నీరు చేరింది. మార్కొండపాడు ఇందిరానగర్ కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. ఊనగట్ల-చిక్కాల రోడ్డు పలుచోట్ల ముంపునకు గురైంది. గరప్పాడులో పలు ఇళ్లు ముంపులో చిక్కుకున్నాయి. నిడదవోలు-పంగిడి రహదారిపై ఊనగట్ల వద్ద వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. బ్రాహ్మణగూడెం రావుల చెరువు, ఊనగట్ల పాపయ్య చెరువు, ఊర చెరువు పొంగి ప్రవహిస్తున్నాయి. చాగల్లులోని పేముల కాలువ వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. బ్రాహ్మణగూడెం, నందిగంపాడు, మార్కొండపాడు, ఊనగట్ల, ఎస్.ముప్పవరం తదితర పల్లపు ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి.

పెరవలి: మండలంలో ఒక్కరోజులో 105 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలకు కానూరు, కానూరు అగ్రహారం, నడుపల్లి, ఉసులుమర్రు, తీపర్రు, పెరవలి, కాపవరం, ఖండవల్లి, ముక్కామల, మల్లేశ్వరం, అన్నవరప్పాడు గ్రామాల్లో సుమారు 500 ఎకరాల్లోని పంటలు నీట మునిగాయి. ఇటీవలే నాట్లు వేసిన వరి చేలు గోదావరిని తలపిస్తున్నాయి. మరో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే నీటమునిగి ఉన్న వరిచేలు ఎందుకూ పనికిరావని రైతులు వాపోతున్నారు. పక్వానికి వచ్చిన కూరగాయలను కోసేందుకు కూడా వర్షం తెలిపి ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు.

ముంచెత్తిన ఎర్ర కాలువ



నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో భారీ వర్షాలకు నీట మునిగిన వరిపొలాలు



నిడదవోలు మండలం కంసాలిపాలెం వద్ద జల దిగ్బంధంలో పంట పొలాలు

- నీట మునిగిన 6,200 ఎకరాల్లోని పంటలు
- కంసాలిపాలెం-మాధవరం మధ్య రాకపోకల బంద్
- పరిశీలించిన మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి

నిడదవోలు రూరల్: భారీ వర్షాలకు మండలంలోని 12 గ్రామాలు వణుకుతున్నాయి. ఒకవైపు గోదావరి ఉరకలెత్తుతుండగా, మరో వైపు ఎగువన కురిసిన వర్షాలతో గురువారం రాత్రి ఎర్ర కాలువ ముంచెత్తింది. సుమారు 6,200 ఎకరాల్లోని పంట నీట మునిగింది. కంసాలిపాలెం, సింగవరం, రావిమెట్ల, జె.కండ్రిగ గ్రామాల్లోని రోడ్లు, పంటలు జలమయం అయ్యాయి. కంసాలిపాలెం-మాధవరం, సింగవరం-కంసాలిపాలెం మధ్య రోడ్లపై ఎర్రకాలువ నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మాధవరం వద్ద వంతెనపై ఎర్ర కాలువ నీరు ప్రమాదకర స్థితికి చేరడంతో రాకపోకలు స్తంభించాయి. అమ్మేపల్లి, కోరుమామిడి, ఉనకరమిల్లి, రావిమెట్ల, సింగవరం, జె.కండ్రిగ, కంసాలిపాలెం, తాళ్లపాలెం, పురుషోత్తపల్లి, పందలపర్రు, పెండ్యాల, విజ్జేశ్వరం గ్రామాల పరిధిలోని 4,900 ఎకరాల్లోని వరి, 800 ఎకరాల్లోని చెరకు, 350 ఎకరాల్లోని అరటి, 150 ఎకరాల్లోని కూరగాయల పంటలకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. దొండపాదులు, మిర్చి, అరటి తోటల్లో వరదనీరు చేరింది. మూడేళ్లుగా ఎర్రకాలువ ముంపు లేకపోవడంతో ముందస్తుగా పంటలు వేసిన రైతులకు ఈఏడాది ఎర్ర కాలువ మళ్లీ కన్నీరు మిగిల్చింది. పెండ్యాల, విజ్జేశ్వరం, జీడిగుంట గ్రామాల పంటలు ఇంకా గోదావరి వరద ముంపులోనే ఉన్నాయి.

ఎర్ర కాలువ ముంపుతో జలమయమైన కంసాలిపాలెం, సింగవరం గ్రామాల్లోని పంటలను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహ కిషోర్, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, జేడీఏ మాధవరావు, తహసీల్దార్ నాగభూషణ, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, కూటమి నాయకులు పరిశీలించారు. మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతిలు పంట నష్టంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు, గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎర్ర కాలువ ప్రవాహంతో మాధవరం వంతెన నీట మునగడంతో రాకపోకలను నిషేధించామని, ప్రయాణికులు, వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకున్నట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ తెలిపారు.

తగ్గుముఖం పట్టిన ఎర్ర కాలువ

వర్షాలకు ఎర్ర కాలువ పొంగి ప్రవహిస్తోంది. గురువారం అర్ధరాత్రి 4.55 మీటర్ల గరిష్ఠ నీటి మట్టానికి చేరుకుంది. శుక్రవారం ఉదయానికి 4.10 మీటర్లకు, మధ్యాహ్నానికి 4 మీటర్లకు శుక్రవారం రాత్రి 7 గంటలకు 3.90 మీటర్లకు నీటిమట్టం తగ్గింది. కొంగువారిగూడెం రిజర్వాయరు నుంచి గంటకు 13 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు అప్ ల్యాండ్ సబ్ డివిజన్ డీఈ రవీంద్రబాబు తెలిపారు. ఈనీటితో పాటు బైనేరు, పులివాగుల నుంచి వచ్చే వరద నీరు రిజర్వాయర్ దిగువన కలుస్తున్నాయన్నారు.


గట్ల పటిష్టతకు చర్యలు చేపట్టండి

కలెక్టర్ ప్రశాంతి

నల్లజర్ల: ఎర్ర కాలువ వరద గట్ల పటిష్టతకు తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు సూచించారు. భారీ వర్షాలు, ఎర్ర కాలువ వరద పరిస్థితిని శుక్రవారం ఆమె నల్లజర్ల మండలంలో పరిశీలించారు. ఆస్తి, ప్రాణనష్టాలు జరగకుండా చూడాలన్నారు. ముంపునకు గురయ్యే గ్రామాల్లో బాధితులకు ముందుగానే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. బలహీనంగా ఉన్న వరద గట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, సిబ్బందిని కాపలా ఉంచాలని సూచించారు. అలాగే ఖాళీ సిమెంట్ సంచులు, ఇసుక బస్తాలను సిద్ధం చేయాలన్నారు. మండలంలో 800 ఎకరాల మేర వరి చేలు నీట మునిగినట్టు ఏవో కె.కమల్‌రాజ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.13 కుటుంబాలకు చెందిన 87 మందికి మండల పరిషత్ పాఠశాలలో పునరావాసం ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ కృష్ణారావు కలెక్టర్‌కు వివరించారు.

వణికిస్తున్న వరుణుడు

- 24 గంటల్లో 207.6 మిల్లీమీటర్ల వర్షపాతం
- స్తంభించిన జనజీవనం
- 5,410 ఎకరాల వరిచేలు నీటమునక
- కుప్పకూలుతున్న ఇళ్లు
- రోడ్లపై ప్రవహిస్తున్న వర్షం నీరు



బందపురంలో నీట మునిగిన వరి చేలు



దేవరపల్లి మండలం త్యాజంపూడి వద్ద నీట మునిగిన వరిని పరిశీలిస్తున్న రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు

దేవరపల్లి: మెట్ట ప్రాంతమైన గోపాలపురం నియోజకవర్గాన్ని వరుణుడు ముంచెత్తుతున్నాడు. ఎడతెరిపి లేకుండా రెండు రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. ఆకాశానికి చిల్లు పడిందా? అని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా దేవరపల్లిలో అత్యధిక వర్షపాతం నమోదైంది. గురువారం సాయంత్రం 4 గంటల వరకూ 124.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, శుక్రవారం ఉదయం 8 గంటల వరకూ 145 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కుండపోత వర్షాలకు పల్లపు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. పంటలు నీట మునిగాయి. వరి చేలు చెరువులను తలపిస్తున్నాయి. రోజుల తరబడి వరిచేలు నీటిలో మునిగి ఉండడంతో నాట్లు కుళ్లిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా వరి పైరుకు అపార నష్టం వాటిల్లినట్టు వారు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 5,410 ఎకరాల్లోని వరి పైరు నీటిలో మునిగి ఉన్నట్టు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే పంట నష్టాన్ని ఇప్పుడే చెప్పలేమని, చేలల్లోని నీరు తగ్గితే గాని వాస్తవ నష్టం తెలియదని వారు చెబుతున్నారు. నీట మునిగిన వరి చేలను ప్రాథమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. మండలాలవారీగా దేవరపల్లిలో 1,560, గోపాలపురంలో 2,250, నల్లజర్లలో 970, ద్వారకాతిరుమలలో 630 ఎకరాల్లో వరి పైరు నీట మునిగినట్టు అధికారులు వెల్లడించారు.

పొంగి ప్రవహిస్తున్న చెరువులు

భారీ వర్షాలకు చెరువులు, వాగులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దేవరపల్లి మండలంలోని యర్నగూడెం గండి చెరువు, త్యాజంపూడిలోని ఆవ చెరువు, సంగాయగూడెంలోని పానకాల చెరువు పొంగి ప్రవహిస్తున్నాయి. బందపురంలోని వాగు ఉధృతంగా ప్రవహించడంతో సమీపంలోని కాలనీ ఇళ్లు నీట మునిగాయి. దేవరపల్లిలోని లేఅవుట్ కాలనీ వరదనీటితో నిండి ఉంది. దీంతో ప్రజలు బయటకు వచ్చే దారిలేక అవస్థలు పడుతున్నారు. బందపురం లే అవుట్‌లో నిర్మించిన గృహాలు పూర్తిగా నీట మునిగి ఉన్నాయి. లే అవుట్‌ను సమీపంలోని వాగు నీరు ముంచెత్తింది. పెద్ద చెరువులోని వరిచేలు నీట మునిగాయి.

తాడిపూడి కాలువకు గండి

వరదనీరు తాడిపూడి ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువలోకి ప్రవేశించింది. దాంతో ఆ కాలువలో నీటి ప్రవాహం ఎక్కువై దేవరపల్లి మండలం యర్నగూడెం వద్ద గండి పడింది. గండి ద్వారా నీరు దిగువన గల పంటలను ముంచెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గండి పడిన ప్రాంతాన్ని మండల రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గౌరీపట్నం వద్ద కొవ్వాడ కాలువ పంట పొలాలను ముంచెత్తి ప్రవహిస్తోంది. సుమారు 500 ఎకరాల్లోని వరిపైరు నీట మునిగి ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

దెబ్బతిన్న గృహాల నమోదు

అధిక వర్షాలకు నీటిలో తడిచి నానిపోయి పడిపోయిన గృహాలను రెవెన్యూ అధికారులు పరిశీలించి నమోదు చేస్తున్నారు. మండల రెవెన్యూ అధికారి వైవీ ఆచారి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేష్, వీఆర్వోలు గ్రామాల్లో పర్యటించి గృహాలను పరిశీలించారు. దేవరపల్లి, రామన్నపాలెం, త్యాజంపూడి, సంగాయగూడెం గ్రామాల్లో పలు గృహాలు పడిపోయినట్టు ఆర్‌ఐ వెంకటేష్ తెలిపారు. దెబ్బతిన్న గృహాలను నమోదు చేసి నివేదిక తయారు చేస్తున్నట్టు తెలిపారు.